# సంధ్యా సమస్యలు

''అమ్మా! నేనో మాటచెప్పనా '' అంది మా పెద్దమ్మాయి శ్యామలి.

ఏవిటన్నట్టు తలెత్తి చూసాను. అదెందుకో సంశయిస్తోంది. ఏదో చెప్పాలనుకుంటూ చెప్పలేకపోతోంది. వ్రాస్తున్న కలాన్ని పుస్తకంమీద పెట్టి కుర్చీని పక్కకి జరుపుకుని దానివైపు తిరిగి కూర్చున్నాను. '' అలా కూర్చో'' అన్నాను సోఫాచూపించి.

టేబుల్‌లేంప్ వెలుగుతప్ప, గదంతా చీకటిగా ఉంది. చెయ్యిచాపి ట్యూబ్‌లైట్ స్విచ్చి వెయ్యబోయాను. '' ఆ.. ఆ.. వద్దు'' అంది కంగారుగా శ్యామలి. '' ఇలాగే బావుంది'' అంది సంజాయిషీ చెప్తున్నట్టు.

ఈ రోజిది ఎందుకిలా ప్రవర్తిస్తోంది? ఆడపిల్లలిద్దరూ చిన్న పిల్లలుగా ఉండగా డబ్బుమీది పేరాశతో మరోపెళ్లి చేసుకుని మానుంచి దూరమయ్యాడు వీళ్లతండ్రి. పెద్దల నెదిరించి గుళ్లో పెళ్లి చేసుకున్న నేను సాక్ష్యాధారాలు చూపలేక నిస్సహాయంగా ఉండిపోయాను. వీళ్లని పెంచడమే నాజీవిత పరమావధి అనుకున్నాను. బాల్యంలో పిల్లలుగా ఏం చూసానో, ఊహ తెలిసినప్పటినుంచీ స్నేహితుల్లాగే ట్రీట్ చేస్తున్నాను. వాళ్ల ఇష్టాలే నా ఇష్టాలు చేసుకున్నాను. వాళ్లు కోరుకున్న చదువులే చదివించాను. నాకొచ్చే జీతానికి నాశక్తికి మించిందే అయినా పెద్ద దాన్ని బి.టెక్ చేయించాను. చిన్నది సైన్స్‌లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేస్తోంది. ఎప్పుడో లోన్ తీసుకుని కట్టించిన ఇంటి అప్పుమొన్ననే తీరింది. ప్రస్తుతం నిరుద్యోగులైన ఇంజనీర్లలో శ్యామలి ఒకత్తి. ఆ ఫీలింగ్ రాకూడదని అతి సూక్ష్మంగా వ్యవహరిస్తాను దీన్తో.

'' అమ్మా..''

''చెప్పమ్మా''

''మరీ.. వాళ్లడగిన కట్నం ఇచ్చేస్తేనే బావుంటుంది కదా''

ఉలిక్కిపడ్డాను నేను. నన్ను నేనే సంబాళించుకుంటూ ''శ్యామలీ! వాళ్లడిగిందెంతో తెలుసా, లక్షరూపాయలు'' అన్నాను.

"అవును, ఈ రోజుల్లో ఇంజనీర్లకి నాలుగైదు లక్షలిస్తున్నారట తెలుసా!"

శ్యామలి గొంతులో ఇందాకటి సంశయంలేదు.

"అలా అని అతను చెప్పేడా?"

"ఎవరు చెప్తే ఏం, ఉన్న మాటేకదా!"

"ఈ మాత్రానికి దీనికి 'ప్రేమపెళ్లి' అని పేరుపెట్టుకోవడం ఎందుకు?"

"ప్రేమించడం అంటే నష్టపోవడమా నీదృష్టిలో?"

బాణంలా గుచ్చుకుందీమాట నాకు.

"లాభ నష్టాల బేరీజు లెందుకులే, ఇదేదో బిజినెస్‌లా"

"నువ్వంత సెన్సిటివ్‌గా మాట్లాడితే నేనేం చెయ్యలేను. పరాయింటికి వెళ్తున్నప్పుడు నాలైఫ్‌కంటూ ఓ సెక్యూరిటీ కావాలి కదా"

"నీ చదువు నీకు సెక్యూరిటీ కాదా?"

"ఉద్యోగం చెయ్యడానికి వాళ్లొప్పుకోవడం లేదుకదా"

"అయితే, ఆడపిల్లలు కట్నాలిచ్చే తీరాలంటావ్, అవునా?" నాగొంతులోంచి ఉబికి రాబోతూన్న ఎగతాళిలాంటి భావాన్నేదో అతి ప్రయత్నం మీద వెనక్కి నెట్టేసాను.

"నే నొక్కదాన్నే అనడంలేదు. ఈ రోజు లోకమంతా అలాగే ఉంది. అప్పట్లో మీవాళ్లు కట్నమిచ్చి నాన్నగారితో నీ పెళ్లి జరిపి ఉంటే ఇలా జరిగిదేనా?"

"శ్యామలీ.." ఆ చీకటి గదిలో నాగొంతు తరంగాలుగా ప్రతిధ్వనించింది. ఇది నేను పెంచిన ఆడపిల్లేనా? నా ప్రాణానికి ప్రాణంగా చూసుకున్న నా బిడ్డేనా? దీని చదువు దీనికి నేర్పిన నాగరికత ఇదేనా?

అమ్మగా నామీద ఒకింతైనా సానుభూతి లేదా? ఎంత కఠినంగా మాట్లాడుతోందీ! కుర్చీ అంచుల్ని గట్టిగా పట్టుకుని నన్నునేను నిభాయించుకున్నాను.

"అలాగే చేద్దాంలే, నువ్వెళ్లి పడుకో" అన్నాను గొంతు పెకలించుకుని.

★★★

ఆకాశం చుక్కల చీరకట్టుకున్న అమావాస్య రాత్రి. గదిలో ఉక్కని భరించలేక వాకిట్లో వాల్చిన మంచం మీద నడుం వాల్చాను. దూరంగా ఎక్కణ్ణుంచో గులాం ఆలీ గొంతు మార్దవంగా గాలిలో తేలి తేలి వస్తోంది. ఒంటరిగా నిలబడిన కొబ్బరిచెట్టు చీకట్లో జుట్టువిరబోసుకున్న అనాథలా ఉంది.

శ్యామలి పెళ్లి తర్వాత అద్దె ఇంట్లోకి మారక తప్పనిసరైంది. ఈ పరిసరాలకి ఇంకా పూర్తిగా అలవాటు పడక కొంత ఇరుకు ఫీలవుతున్నాం.

లోపల గదిలో ఫేను కింద కూర్చుని రాజీవి ఇంకా ఏదో చదువుకుంటోంది. పరీక్షలైపోయినా దాని బిజీ తగ్గలేదు. అర్ధరాత్రి వరకూ ఏదో రాస్తూ, చదువుతూ ఉంటుంది.

వారం క్రితం నా కోలెక్చరర్ పట్టాభి చెప్పింది విన్నప్పట్నుంచీ నాగుండె గొంతుకలోనే కొట్లాడుతోంది.

ఆరోజు వస్తూనే దాని పుస్తకాలన్నీ వెతికి చూసాను. ఎలాంటి ఆధారం దొరకలేదు. పట్టాభి చెప్పిన మాట తప్ప మరెలాంటి ఋజువులూ లేవు. ఆ స్నేహితులెవర్నీ ఎప్పుడూ ఇంటికి తీసుకురాలేదు. అలాంటిదేదైనా ఉంటే వంటమనిషి నాకు చెప్పకుండా ఉండదు. బైట ఎక్కడా నేను దాన్ని ఎవరితోనూ చూడనూలేదు.

పట్టాభి ఏమన్నాడూ..'' యశోధర గారూ! ఆ పార్టీ, ఆ ఇజం యువతని చాలా తొందరగా ఆకట్టుకుంటాయి. మీ అమ్మాయి ఇప్పుడిప్పుడే దాన్లో అడుగుపెడుతున్నట్టు తెలిసింది. జాగ్రత్త పడండి'' అని కదూ!

అడుగుల చప్పుడైంది, రాజీవి వస్తున్నట్టుంది. మంచం పక్కకొచ్చి నిలబడి ''అమ్మా, ఇంకా నిద్రపోలేదా?'' అంది.

నేను అట్నుంచి ఇటుతిరిగాను.

''మంచినీళ్లు తెచ్చాను, తాగుతావా?''

'' వద్దులే, అలా స్టూలుమీద పెట్టు'' అన్నాను.

జగ్గు, గ్లాసు స్టూలుమీద పెట్టి వెళ్లబోతోంది.

''రాజీ!''

'' ఏమ్మా''

'' ఇట్రా, ఇలా వచ్చి నా పక్కన కూర్చో'' లేచి కూర్చుని, జరిగిచోటిచ్చాను.

'' ఏంటమ్మా''

'' నీ పరీక్షలైపోయాయికదా, నా కొలీగ్ ఒకాయనకి తెలిసి మంచిసంబంధం ఏదో ఉందట. వాళ్లని రమ్మని రాయనా?''

రాజీవి మౌనంగా ఉండిపోయింది.

'' అబ్బాయి డాక్టరట. మంచి పొజిషన్లో ఉన్నాడట.''

'' నా పెళ్లికేం తొందరొచ్చిందమ్మా. మొన్ననే కదా అక్కయ్యపెళ్లి చేసి పంపించావ్'' రాజీవి గొంతులో సన్నని విసుగు.

'' అదే, నీకూ చేసేస్తే నాభాధ్యత తీరుతుంది. పోనీ, నీ దృష్టిలో ఎవరైనా ఉంటే చెప్పు. ఆ అబ్బాయినే మాట్లాడదాం''

'' ఛ. అలాంటిదేం లేదు. అయినా, పెళ్లి తప్పమరో టార్గెట్ లేదామ్మా జీవితానికి?''

''అలా అంటే ఎలా, మనిషికి తోడూ నీడా అవసరం కదా, పెళ్లి తప్పనిసరైనప్పుడు ఎప్పుడు చేసుకుంటే ఏం? నేను రిటైరైపోతే చెయ్యగలనో లేదో. ఇల్లమ్మిన డబ్బు మరో లక్షమిగిలింది బేంకులో. అదిచ్చేసి, నిన్నో అయ్యచేతిలో పెట్టేస్తే...''

'' అమ్మా'' అరిచింది రాజీవి. ''నేనేమైనా బొమ్మనా నన్నెవరిచేతిలోనో పెట్టె య్యడానికి? తిరిగి కట్నం ఒకటిస్తావా? కట్నం తీసుకునే వాణ్ణి నేనసలు పెళ్లిచేసుకోను''

''వాళ్లకివ్వద్దులే, పోనీ నీకు సెక్యూరిటీగా ఉంటుంది. నీ పేరుతో బేంకులో వేస్తాను''

'' అలా అయితే పెళ్లి ప్రసక్తిలేకుండానే వెయ్యి. డబ్బు పుచ్చుకుని మరీ నన్నుద్ధరిం చేటట్టు పోజుపెట్టే ఏ మగాడికి నన్ను నేను అర్పించుకోవడం నాకిష్టంలేదు. అసలు మగపు రుగులంటేనే నాకిష్టంలేదు. అప్పట్లో ఆ మగాడికి నువ్వు ప్రేమ – పెళ్లి అంటూ బలహీనంగా లొంగిపోకుండా ఉంటే..'' గొంతులో ఆవేశాన్ని నింపుకుని ఇంకా ఏదో మాట్లాడుతోంది రాజీ.

ఈ పిల్లల్ని కని, పెంచిన తల్లిగా ఇద్దరి దృష్టిలోనూ నేను తప్పుచేసినట్లేనా?

నన్నేదో నీరసం ఆవహించినట్లై వెనక్కి వాలిపోయాను.

ఇప్పటి ఈ యువతని ఎలా అర్థంచేసుకోవాలి? జీవితసంధ్యాకాలంలో ఈ సమ స్యల నెలా పరిష్కరించాలి?

('రచన' – జూలై '92)